ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 కనిష్ఠం 18.2
కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం 17 జనవరి 2024



అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, జనవరి 16: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం, గణితం సబ్జెక్ట్‌లు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం సరిపోతుందన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 20 సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో తమ దరఖాస్తులు అందించాలని సూచించారు. ఇంటర్వ్యూలు 22న ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించబడుతాయని తెలిపారు.





పంచాయతీ ఎన్నికలపై..
సందిగ్ధం!

కామారెడ్డి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇది వరకే యంత్రాంగాన్ని ఆదేశించినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే సూచనలు కనపడడం లేదు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గడువులోగా ఎన్నికలు నిర్వహిస్తుందా లేదా అనే చర్చ గ్రామాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంది. లోక్‌సభ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలా వద్దా అనే ఆలోచనలో రాష్ట్ర సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది.

అంతా అయోమయం

గతంలో 5 ఏళ్లకు ఒకసారి రిజర్వేషన్‌లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించేవారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట సవరణ చేసి స్థానిక సంస్థల రిజర్వేషన్ కాలపరిమితి ప్రతీ 10 సంవత్సరాలకోసారి సవరించాలని నిర్ణయించింది. ఒక్కసారి ప్రకటిస్తే అదే కేటగిరి వారు రెండు సార్లు పోటీచేసే అవకాశం ఉంటుంది. ఈ నిబంధన ప్రకారం అయితే గత ఎన్నికల సమయంలో కేటాయించిన రిజర్వేషన్‌లు ఈ సారి అమలు చేయాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 5 సంవత్సరాల క్రితం ఖరారు చేసిన రిజర్వేషన్లను అదేవిధంగా కొనసాగిస్తుందా లేక కొత్తగా కేటాయిస్తారా అనే విషయం తేలాల్సి ఉంది. మళ్లీ రిజర్వేషన్‌లు ఖరారు చేయాలంటే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో మార్పులు చేయాలి. ఇందుకు చట్ట సవరణ తప్పనిసరి. ఈ ప్రక్రియ నిర్వహించాలంటే ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి.

ఫిబ్రవరి 1తో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి

రాష్ట్రంలో 2019 జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2024 ఫిబ్రవరి 1తో పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి పూర్తికానుంది. నిబంధనల ప్రకారం 15 రోజుల ముందుగానే ఎన్నికల తతంగం అంతా పూర్తికావాలి. అయితే జనవరిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పైగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఇప్పటి నుంచే ఆ ప్రక్రియను ప్రారంభిస్తే తప్ప జనవరి 15వ తేది నాటికి ఎన్నికలను పూర్తిచేసే పరిస్థితి ఉండదు. అయితే ప్రభుత్వం ఇంత తొందరగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో లేనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉంది. గ్రామాల్లో పార్టీ అంత పటిష్ఠంగా లేదు. ఈ పరిస్థితుల్లో పథకాల అమలు, పార్లమెంట్ ఎన్నికలు పూర్తి చేసుకోవడం ద్వారా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులకు బలం చేకూర్చవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

- నెలాఖరుతో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు.. 4,642 వార్డులు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు
- పార్లమెంట్ ఎన్నికల అనంతరం పంచాయతీ పోరు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన
- ఫిబ్రవరి 1తో ముగియనున్న పంచాయతీల కాలపరిమితి

సర్పంచ్‌ల పదవీకాలం ముగిశాక జీపీల బాధ్యతలు ప్రత్యేకాధికారులకు?

గడువులోగా ఎన్నికలు జరగక పోతే పంచాయతీ పాలన ప్రత్యేకాధికారులకు అప్పగిస్తారనే ప్రచారం సాగుతోంది. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు 4,642 వార్డులు ఉన్నాయి. గతంలో 3 నుంచి 4 గ్రామ పంచాయతీలకు కలిపి మండలస్థాయి అధికారులను ఇన్‌చార్జీ గా నియమించారు. ఈ సారి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే?

లోక్‌సభ ఎంపీ పదవి కాలం 2024 మేతో పూర్తికానుంది. వాటికి సంబంధించి ఓటరు నమోదు వంటి ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయింది. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. దాని వల్ల ఎక్కువ మొత్తంలో ఎంపీ స్థానాలను గెలుచుకునే వీలుంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలు పెట్టుకుంటే పథకాల అమలు, ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, కార్యాచరణ రూపకల్పన, అమలు వంటి వాటిలో ఇబ్బందులు తలెత్తుతాయని కాంగ్రెస్ భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలంటే కీలకమైన ఎంపీ స్థానాల ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే విజయ అవకాశాలు కూడా కాంగ్రెస్‌కు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని గ్రామీణ స్థాయిలోనూ పార్టీకి మరింత బలోపేతం చేసుకోవచ్చని ఆ దిశగానే ఆలోచనలు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి

మరో 9 కొత్త పంచాయతీలకు ప్రతిపాదన

జిల్లాలో కొత్తగా 9 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదించారు. నాగిరెడ్డిపేట మండలంలో చిన్నఆత్మకూర్, కన్నారెడ్డి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, గాంధారి మండలంలో పిస్కిల్‌గుట్ట తండా, నస్రుల్లాబాద్ మండలంలో ఫకీర్‌నాయక్ తండా, సంగెం(ఏ) మాచారెడ్డి మండలంలో సోమర్‌పేట్ తండా, గుంటితండా, ఒడ్డెరగుడెం తండా, బీర్కూర్ మండలంలో శాంబాపూర్‌లను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం మొత్తం 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటితో పాటు 4,642 వార్డులు ఉన్నాయి. వీరి పదవి కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 1తో ముగియనుంది. 2019 ఓటరు జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 5,13,204 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 2,50,547, మహిళలవి 2,62,613, థర్డ్‌జండర్‌వి 44 ఓట్లు ఉన్నాయి. ఇందులో ఎస్టీ ఓటర్లు మొత్తం 46,820, ఎస్సీ ఓటర్లు 88,640, బీసీ ఓటర్లు 3,28,084 ఓటర్లు, ఇతరులవి 49,660 ఓటర్లు ఉన్నారు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం ఉందని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ఇంటి ముందు రంగుల హరివిల్లులు
- పతంగులు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపిన జిల్లా యువకులు
- ఇంటింటా మహిళల నోములు



కామారెడ్డిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

కామారెడ్డి టౌన్, జనవరి 16: జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతో పాటు వివిధ మండల కేంద్రాలు, ఆయా గ్రామాలతో పాటు కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం సంక్రాంతి, కనుమ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటి ముంగిళ్లను శుభ్రపరిచి రంగురంగులతో చూడ ముచ్చటగా ముగ్గులు వేశారు. ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి పూజలు నిర్వహించారు. పట్టణంలోని విద్యానగర్, శాంతి థియేటర్ రోడ్డు, పంచాముఖి హనుమాన్ కాలనీ, గాంధీనగర్ కాలనీ, అశోక్‌నగర్, ఎన్‌జీవోఎస్ కాలనీ, వివేకానంద కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, సైలాన్ బాబా కాలనీ, బతుకమ్మ కుంట, గడి రోడ్డు, పాంచ్ చౌరస్తా, సరోజినీదేవి రోడ్డు, వీక్లీమార్కెట్, జేపీఎన్ రోడ్డు, సిరిసిల్లా రోడ్డు, సుభాష్ రోడ్డు, పెద్ద బజార్, గొల్లవాడ, అజంపూర, బడాకసాబ్ గల్లీ, కాకతీయనగర్, పెద్దబజార్, ముదాంగల్లీ, గడిరోడ్డు, భారత్‌రోడ్, రాంమందిర్, గాంధీగంజ్, అయ్యప్పనగర్, ఆర్బీనగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, గుమస్తా కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, ఇందిరానగర్, రాజీవ్‌నగర్, కాలనీల్లో మహిళలు ఇళ్ల ముందర వేకువజామునే రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. ఆయా కాలనీల్లోని మహిళలు కుటుంబ సమేతంగా కాలనీల్లోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి గడపలపై రేగు పండ్లు, నవధాన్యాలు పెట్టి పండుగను జరుపుకున్నారు. పిండి వంటలు చేసుకుని భోజనాలు చేశారు. చిన్నారులు, యువకులు, మహిళలు పతంగులను ఎగురవేసి ఆనందోత్స వాలు జరుపుకున్నారు. ఇళ్లలో మహిళలు ఆయా రకాల వస్తు వులతో నోములు నోచుకున్నారు. ముత్తైదువులను ఇళ్లలోకి పిలుచుకొని పసుపు, బొట్టును సమర్పించుకున్నారు. అలాగే ఇంట్లో పసుపు కుంకు మతో అందంగా అలంకరించిన స్థలంలో ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి నవధాన్యాలు, కూరగాయలు పెట్టి సంప్రదాయ బద్ధంగా ఆవు పాలను పొంగించారు.



రామారెడ్డిలో..

క్యాసంపల్లిలో గంజాయి నూనె స్వాధీనం

కామారెడ్డి టౌన్, జనవరి 16: కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామ శివారులో 190 గ్రాముల గంజాయి నూనెను ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. గ్రామ శివారులో కొందరు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు అరకు నుంచి గంజాయి నూనెను తక్కువ ధరకు తీసుకుని వచ్చిన ఇక్కడి యువకులకు అధిక ధరలకు అమ్మి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. మళ్లీ ఇదేరకంగా విక్రయాలు చేస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రెండు కార్లు, ఒక ద్విచక్రవాహనం, రెండు స్కూటీలు, 7 మొబైల్ ఫోన్‌లు, 190 గ్రాముల గంజాయి నుంచి తీసిన నూనె దీని విలువ సుమారు రూ.97,500ను స్వాధీన పరుచుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి నూనె

కళాహీనంగా..
అతిథి గృహాలు!

- నిజాంసాగర్‌లో ఎండిపోతున్న గార్డెన్లు
- పట్టింపులేని ఇరిగేషన్ అధికారులు
- ఇది నైజాం కాలం నాటి అతిథి గృహాల దుస్థితి

నిజాంసాగర్, జనవరి 16 : ఆనాడు రాష్ట్ర రాజధానిలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న నిజాంసాగర్ వీఐపీ అతిథి గృహాలు కళాహీనంగా మారాయి. నిర్వహణ చూసే ఇరిగేషన్ అధికారులు ససేమిరా అనడం గమనార్హం. నిజాంసాగర్ ప్రాజెక్టు సబ్ డివిజన్ కార్యాలయం సమీపంలో ముందుగానే అతిథి గృహాల నిర్మాణాలు చేశారు. అప్పట్లో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేవి. కాలక్రమేణా 2004లో 10 లక్షల రూపాయల వ్యయంతో నక్సల్స్ పేల్చి వేసిన సగభాగం అతిథి గృహంను నూతనంగా నిర్మించారు. రెండు సూట్‌లు, ఒక హాల్ నిర్మాణం చేపట్టి అధునాతన వసతులు కల్పించారు. అతిథి గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం ఎలాంటి బడ్జెట్ కేటాయించకపోవడంతో కాల క్రమేణా కళాహీనంగా మారాయి. అతిథి గృహంను 2013లో కాంగ్రెస్ హయాంలో దాదాపు 60 లక్షల రూపాయల వ్యయంతో పునర్ నిర్మాణం చేపట్టారు. 2021లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శిస్తారని రూ. 30 లక్షలతో నైజాంకాలం నాటి అతిథి గృహాన్ని మరమ్మతులు చేశారు. ప్రతీ గదిలో ఏసీ, ఫర్నిచర్లు, మంచాలు ఏర్పాటు చేశారు. పర్యటన రద్దు కావడంతో ఈ అతిథి గృహాలను ప్రారంభించలేక పోయారు. కేవలం పురాతన అతిథి గృహాన్నే వీఐపీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉపయోగిస్తున్నారు. సిబ్బంది కూడా లేకపోవడంతో కళాహీనంగా మారాయి. వీఐపీ అతిథి గృహాల సమీపంలో వీఐపీ గార్డెన్‌లతో పాటు స్వాగత తోరణాలు ఆహ్లాదకరంగా ఉండగా, నిర్వహణ లేక ఎండిపోతున్నారు. సేద తీర్చుకునేందుకు ఆవరణలో నీటి ఫౌంటెన్లు ఏర్పాటు చేసినా అవి కళాహీనంగా ఉండటం గమనార్హం. ఫౌంటెన్లలో నీళ్ల రాకపోవడంతో అవి నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. రెండు రహదారులకున్న గేట్లు విరిగిపోవడంతో మరమ్మతులు చేయాలనే ఆలోచన లేకపోవడం గమనార్హం. లక్షలు వెచ్చించి ఏసీలు, విద్యుద్దీ



2004లో నిర్మించిన అతిథి గృహం

కరణ పనులు చేపట్టినా మూన్నాళ్లకే మరుగున పడుతున్నాయి. ఉభయ జిల్లాలు, రాష్ట్ర రాజధానిలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న వీఐపీ అతిథి గృహాలు కళాహీనంగా మారుతున్నాయి. పైన పటారం, లోన లొటారం అనే చందంగా దర్శనమిస్తున్నా పాలకులు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ అతిథి గృహాల నిర్వహణకు సిబ్బందితో పాటు వంట మనిషిని కూడా నియమించారు. వంట మనిషి చనిపోవడం, సిబ్బంది రిటైర్డ్ కావడంతో ఎవరిని నియమించారు. వీఐపీలు, అధికారులు అతిథి గృహాల్లో సేద తీరుతున్నా కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నైజాం కాలం నాటి వీఐపీ అతిథి గృహాలను సుందరంగా తీర్చిదిద్ది వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.



తుది మెరుగులు దిద్దిన నైజాం కాలం నాటి అతిథి గృహం



అతిథి గృహంలో ఉన్న స్వాగత తోరణం



విద్యుత్ షాక్‌కు గురైన కరణ్‌సింగ్

గాలి పటాలను పట్టుకునే క్రమంలో విద్యుత్ షాక్

- యువకుడికి తీవ్ర గాయాలు
- బాన్సువాడలో ఘటన

బాన్సువాడ, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా తెగిన గాలి పటాలను పట్టుకునే క్రమంలో ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురైన ఘటన బాన్సువాడలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాన్సువాడ పట్టణానికి చెందిన కరణ్‌సింగ్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం బాన్సువాడలో పలువురు ఎగురవేస్తున్న గాలిపటాలు తెగిపోగాయి. దీంతో వాటిని పట్టుకునే క్రమంలో మిషన్ భగీరథ కార్యాలయం వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు ప్రమాదవశాత్తు తగలి.. కరెంటు షాక్‌తో అక్కడే కుప్పకూలాడు. కరణ్‌సింగ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు నిజామాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

పిట్లం జనవరి16: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను మద్నూర్ ఆర్టీవో సుభాష్ ప్రారంభించారు. మంగళవారం ధర్మారం టోల్ ప్లాజా వద్ద 35వ జాతీయరహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ఇంజనీరింగ్, మరియు విద్యాపరమైన చర్యల సాయంతో రహదారి భద్రతను మెరుగుపరచడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతిజ్ఞను నిర్వహించి మరణాలను తగ్గించడంలో అత్యవసర సేవల పాత్ర గురించి ఆర్‌ఐ వివరించారు. కార్యక్రమంలో పెద్దకొడప్గల్ ఎస్సై కోనారెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అంబర్‌సింగ్, రెహమాన్ ఆర్‌ఈ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

బీర్కూర్, జనవరి16: వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా అంబిలి బస్వారాజ్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్ నియామక పత్రాన్ని బస్వరాజ్ పటేల్‌కు అందజేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడిగా తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లింగాయత్‌ల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, సంఘ బలోపేతం కోసం పాటుపడతానని ఆయన స్పష్టంచేశారు.

18న మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో వడ్ల వేలం

నాగిరెడ్డిపేట, జనవరి16: మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో ఈనెల 18న మధ్యాహ్నం 12 గంటలకు విత్తనం కోసం ఉపయోగపడని 120 క్వింటాళ్ల దొడ్డు రకం వడ్లను విత్తన క్షేత్రంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు విత్తనక్షేత్రం ఏడీఏ వీరస్వామి తెలిపారు. విత్తనం కోసం ఉపయోగపడని దొడ్డు రకం వడ్లు జేజీఎల్ 24423 రకం 90 క్వింటాళ్లు, కేఎన్ఎం 118 రకం 30 క్వింటాళ్ల వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు రెండు వేల రూపాయలు దరఖాస్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తాం

దోమకొండ, జనవరి 16: కాంగ్రెస్ పభుత్వం చేపట్టిన పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి షబ్బీర్‌అలీ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చేరేలా గ్రామ స్థాయిలో పని చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి ముత్యంపేట పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అన్నారు. కాంగ్రెస్ హయంలోనే పెదలకు పథకాలు అందయన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అబ్ధిదారులకు అందే విధంగా గ్రామ స్థాయిలో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంలు రాజు, చంద్రం నరేష్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: మాజీ ఎమ్మెల్యే

బాన్సువాడటౌన్, జనవరి16: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడంతోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో కొనసాగుతున్న ఈఆర్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ తిలకించారు. మ్యాచ్ గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఉండాలన్నారు. అంతేకాకుండా గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల నైపుణ్యతను వెలికితీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, నార్ల సురేష్, మాసాని శేఖర్‌రెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, అన్వర్, అఫ్రోజ్,ఆయా గ్రామాల క్రీడాకారులు తదితరులున్నారు.



ఫైనల్ మ్యాచ్‌లో టాస్ వేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

నేడు రాంపూర్‌లో రక్తదాన శిబిరం

డిచ్‌పల్లి, జనవరి 16: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేడు యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో యువతరం రక్తదాన శిబిరం నిర్వహిస్తోందని యూత్ అధ్యక్షుడు విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రెంజల్,జనవరి16: మండలంలోని మౌలాలి తండా గ్రామంలో మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సర్పంచ్ సునీత బాబు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సంక్రాంతి సెలవు దినాల్లో మౌలాలి తండా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కబడ్డీ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఈ పోటీలలో పాల్గొనడం జరిగిందన్నారు. సంక్రాంతి సెలవులలో ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అశోక్, శ్రీకాంత్, పవన్, మురళీ, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం


నవీపేటలో శివ పార్వతుల కల్యాణ దృశ్యం

నవీపేట,జనవరి16: మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ మందిరంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం, పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు మహిళలు ఒకరికొకరు నోములు అందించుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో రాజశ్రీ, గౌతమి, పల్లవి, స్వప్న, దీపిక, నీలిమా, తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి వీడీసీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


కమ్మర్‌పల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీడీసీ సభ్యులు

కమ్మర్‌పల్లి, జనవరి 16: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అలంకరించి, నిర్వహించిన ముగ్గులపోటీల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. గాయిని కవిత్రి మగ్గిడి లక్ష్మీ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ముగ్గులపోటీల్లో విజేతకు వీడీసీ అధ్యక్షుడు అంగిరేకుల మల్లయ్య యాదవ్, కోశాధికారి సిలివేరి భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి అంకోజి అంకిత్, నవాతే రంజీత్ వీడీసీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాంపూర్, ఫత్తేనగర్‌లలో గ్రామసభలు


ఫత్తేనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ

నవీపేట,జనవరి16: మండలంలోని రాంపూర్, ఫత్తేనగర్‌లలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా పంట పొలాలకు రసాయన ఎరువులు పిచికారి చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, రాంపూర్ సర్పంచ్ రుతు కల్పన, ఫత్తేనగర్ సర్పంచ్ ఆసిఫా ఖతున్, ఎంపీటీసీ లావణ్య, ఆర్‌ఐ మోహన్, మెడికల్ ఆఫీసర్ స్వామాట్ యాదవ్, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, జనార్ధన్ తదితరులున్నారు.

బోధన్‌లో ఏటీఎం ధ్వంసం


ధ్వంసమైన ఏటీఎం మిషన్

బోధన్ రూరల్, జనవరి 16: బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల ఎంకే చౌదరి పెట్రోల్ బంక్ ప్రాంగణంలో ఏటీఎం మిషన్‌ను సిద్దాపూర్ గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి ధ్వంసం చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. డబ్బులు డ్రా చేయడానికి ఏటీఎం కేంద్రానికి వెళ్లగా మద్యం తాగి ఉండటంతో ఏటీఎం మిషన్ అద్దాలను ధ్వంసం చేశాడని, ఈ సందర్భంగా ఆయన చేతికి గాయాలయ్యాయన్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వెళ్లి బాధితున్ని చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గడ్డి మందు తాగి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, జనవరి16: మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన గొల్ల శోభన్ (32) గడ్డి మందు తాగి మృతి చెందినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. గొల్ల శోభన్ బతుకు దెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడని, ఇంటి వద్ద ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. ఈనెల 13న అతని ఇంటి వద్ద గడ్డి మందు తాగారని, దీన్ని గమనించిన కుటుంబసభ్యులు అతనిని చికిత్స నిమిత్తం ముప్కాల్ లోని మమత నర్సింగ్‌హోమ్ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ ఈనెల 14న గొల్ల శోభన్ మృతి చెందినట్టు తెలిపారు. మృతుని తండ్రి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.

జిల్లా అంతటా సంక్రాంతి సంబరాలు


నృత్యం చేస్తున్న దిల్‌రాజ్, గ్రామస్థులు


డొంకేశ్వర్‌లో గాలిపటాలు ఎగురేస్తున్న చిన్నారులు


చందూర్‌లో ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


వర్నిలో మటన్ కోసం బారులు తీరిన ప్రజలు


కమ్మర్‌పల్లిలో ఇంటిముందు రంగురంగుల ముత్యాల ముగ్గు


ఇందల్వాయిలో..

మోపాల్, జనవరి 16: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం భోగి మంటలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో సినీ నిర్మాత దిల్‌రాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆటపాటలతో నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, ఎంపీటీసీ రాములు, రవీందర్‌యాదవ్, నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్, గంగారెడ్డి, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దిల్‌రాజ్ స్వగ్రామమైన నర్సింగ్‌పల్లి కావడంతో ప్రతీసంవత్సరం సంక్రాంతి వేడుకల్లో పాల్గొంటున్నారు. అలాగే ఇందూరుతిరుమల ఉత్సవాల్లో కూడా పాల్గొనడం విశేషం.ఈవేడుకల్లో కుటుంబ సభ్యులందరూ ఉత్సవాలు పూర్తయ్యేంతవరకు భక్తిశ్రద్ధలతో గడుపుతారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమ, మంగళవారం సంక్రాంతి సంబరాలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ రోజున రకరకాల పిండి వంటలు, వాకిట్లో ముగ్గులు వేసి గొబ్బెలు ఏర్పాటు చేసి వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. కనుమ రోజు విందు వినోదాలతో ప్రజలు సరదాగా గడిపారు.

వర్ని: వర్ని, రుద్రూరు, చందూరు మండలాల పరిధిలో సంక్రాంతి పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం భోగీ, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలను ప్రజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. కనుమ వేడుకల్లో భాగంగా చందూర్ మండల కేంద్రంలో ఎద్దుల పరుగు పోటీలు నిర్వహించి కనువిందు చేశారు. సర్పంచ్ సాయిరెడ్డి, వింజో చైర్మన్ ప్యారం అశోక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఏర్పాటు చేశారు. కనుమ సందర్భంగా మటన్, చికెన్ కొనుగోళ్లకు ప్రజలు బారులు తీరారు. దీంతో కిలో నాటు కోడి ధర రూ.500 పలికింది. ఆయా గ్రామాల్లో రంగురంగుల ముగ్గులు వేసి యువతులు, మహిళలు పండుగ ప్రత్యేకతను చాటారు. గాలి పటాలు ఎగురవేస్తూ యువకులు పోటీ పడ్డారు.

నవీపేట: మకర సంక్రాంతి వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం పాలను పొంగించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం చిన్న పిల్లలకు తలపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

● అయ్యప్ప ఆలయంలో పూజలు

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మకర జ్యోతి దర్శనం అనంతరం అయ్యప్ప స్వామిని భక్తులు, మాలధారులు దర్శించుకున్నారు.

బోధన్ రూరల్: బోధన్ పట్టణంతో పాటు సాలూర మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు నువ్వులు, చక్కెర అందిస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వ్యవసాయదారులు తమ ఆచారల ప్రకారం పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరూ ఆయురోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలుచేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేద పండితుల మంత్రోచ్చారణల ప్రత్యేక పూజలు చేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో పెద్దలు, యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి ఆనందోత్సహాల మధయ సంక్రాంతి పండగను జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామాలలో ఇంటి ఎదుట మహిళలు, యువతులు వరి ఇంటి ఎదుట ముగ్గులు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

పెర్కిట్: మకర సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని ప్రజలు ఆనందోత్సవాల మధ్య సంబరాలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను పట్టణ ప్రజలు, పిండి వంటలు రంగుల ముగ్గులు, పతంగులు ఎగురవేస్తూ చిన్న పెద్ద అందరు ఆనందంగా గడిపారు. హన్మాన్ మందిర కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి అదే విధంగా విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ మహిళలకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ బహుమతులు అందజేశారు. జిరాయత్ నగర్ హన్మాన్ మందిరం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్వారి తులసీ, లక్ష్మీనారాయణ, స్థానిక కౌన్సెలర్ ఖాందేశ్ సంగీత, ఖాందేశ్ శ్రీనివాస్, పుష్కర్‌రావు, సురేష్, ఆనంద్, సతయం, హన్మాన్ కమిటీ సభ్యులు, విట్టం శేఖర్, నూకల శేఖర్, బాస్కర్, నవీన్, అంబల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాలలో యువతులు, విద్యార్థినులు తమ ఇంటి ముందు అందమైన ముగ్గులను వేశారు. మామిడిపల్లిలో వేంకటేశ్వరకాలనీలో గిర్వాణి అనే యువతి అయోధ్య రామ మందిరం, శ్రీరామ సీతాదేవీల రంగురంగుల ముగ్గుల రూపంలో వేశారు. అయోధ్య ముగ్గు అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. అదే విధంగా ఆలూర్ మండల కేంద్రంలో ఓ యువతి తన ఇంటి ముందు ముగ్గు వేసి జైరేవంత్‌రెడ్డి అని జైకాంగ్రెస్ అని పేరు రాసి కాంగ్రెస్ పార్టీపై వారి అభిమానాన్ని చాటుకున్నారు.. మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువకులు, పెద్దలు గాలిపటాలు ఎగురవేయడంలో ఉత్సహం ప్రదర్శించారు. అదే విధంగా పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో ప్రతీ గడప ముందు వివిధ రకాల ముగ్గులను వేయగా పలువురు అయోధ్యలోని రామాలయంతో పాటు ప్రధాని నరేంద్రమోదీ, రాముని చిత్రపటాలను వేయడంతో ప్రత్యేకఆకర్షణగా నిలిచాయి.దీంతో పలువురు అభినందించారు.

కమ్మర్‌పల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మకర సంక్రాంతి పర్వదినాన్ని కమ్మర్‌పల్లి మండల ప్రజలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలు అనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తెలుగింటిలోగిల్లి రంగురంగుల ముత్యాల ముగ్గులతో శోభిల్లాయి గ్రామీణ ప్రాంత వాతావరణం ఉట్టిపడేలా తెలుగింటి యువతులు సాంప్రదాయ దుస్తుల్లో వెలిగిపోయారు. గ్రామాల్లో యువకులు, పిల్లలు గాలిపటాలను ఎగురవేస్తూ పరస్పర అనందాలను పంచుకున్నారు. పట్టణాల నుంచి యువకులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలల్లో మునిగితేలారు దూరప్రాంతాలలోని వారందరు గ్రామాలకు చేరుకోవడంతో ప్రతీ పల్లె కొత్తముఖాలతో కలకలలాడింది. మకర సంక్రాంతి సందర్భంగా ప్రతీ తెలుగింట్లో పిండివంటలతో ఘుమఘుమలాడింది, పండగ సందర్భంగా పరస్పరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల ప్రజలకు ప్రజాప్రతినిధులు అధికారులు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం భోగి, సోమవారం కనుమ పండగలను ఆనందోత్సవాలమధ్య ఘనంగా జరుపుకున్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సోమవారం మకర సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు వేసిన పిండి వంటలు గుమగుమలాడాయి. ఉదయం నుంచి సంక్రాంతి పర్వదినం సందర్భంగా దేవాలయాలు కిక్కిరిసి పోయాయి. ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాకిట్లో అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పేర్చారు. కొత్త పంటలతో రైతుల ఇళ్ళలో సిరులు నిండాలని వపూజలు చేశారు.

29న డిచ్‌పల్లి ఎంపీపీ,వైస్ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానం

- ఆర్డీవో సమక్షంలో ఆవిశ్వాసం పై తీర్మానం
- ఆర్డీవోకు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన ఎంపీటీసీలు
- కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్న 12మంది ఎంపీటీసీలు
- ఇటీవల కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు


డిచ్‌పల్లి ఎంపీపీ ఛాంబర్

డిచ్‌పల్లి,జనవరి 16: డిచ్‌పల్లి మండల పరిషత్ అధ్యక్షుడు (భాజపా) గడ్డె భూమన్న, వైస్ ఎంపీపీ కులచారి శ్యాంరావులపై మండలంలోని 13 మంది ఎంపీటీసీ సభ్యులు ఆవిశ్వాసం పెడుతూ తాజాగా ఆర్డీవో రాజేందర్‌కుమార్‌కు అవిశ్వాస తీర్మాణ పత్రాలు సభ్యుల సంతకాలతో అందజేశారని, సంతకాల పరిశీలనకోసం ఫైల్ తనవద్దకు చేరిందని మండల ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు గురువారం తెలిపారు. అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేసిన వారిలో ముల్లంగి గ్రామ ఎంపీటీసీ చిన్నొళ్ల నర్సయ్య (నడిపల్లి-2), మెంట్రాజ్‌పల్లి ఎంపీటీసీ (సుప్రియ), సాంపలి (రాథోడ్ భిక్ష్య), సుద్దులం(గోదావరి), యానంపల్లి (అప్పలమంజుల), ఘన్‌పూర్(కుర్రిసవిత) రాంపూర్(పోతర్లసుజాత), మిట్టపల్లి (బాల గంగాధర్), కమలాపూర్ (దండోళ్ల సుప్రియ), ధర్మారంగ్రామ 1 (నర్సింగరావు),ధర్మారం-2(శకటి రాజమణి), బర్దిపూర్ (కృష్ణవే ణి), గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు ఆర్డీవో రాజేందర్ కుమార్‌కు అవిశ్వాస నోటీస్ పత్రం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుల సంతకాల వెరిఫికేషన్ కోసం ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి ఫైల్ చేరింది. సంతకాల వెరిఫికేషన్ కోసం అధికారులకు అవిశ్వాస నివేదిక అందిస్తామని ఎంపీడీవో గోపిబాబు తెలిపారు. మరో రెండు రోజుల్లో అవిశ్వాసంపై తేదీ ప్రకటన వెలువడే ఆవకాశం కనబడుతుంది. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోసం విశ్వప్రయత్నాలు చేశారు. గత ఎన్నికలో కాంగ్రెస్ నుంచి గెలిచి ప్రస్తుతం నడిపల్లి -2 ఎంపీటీసీగా కొనసాగుతున్న చిన్నొళ్ల నర్సయ్యకు ఎంపీపీ పదవి దక్కే ఆవకాశం కనబడు తుంది. ఇప్పటికే 12మంది ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ అభ్యర్థికి మద్దతు తెలపనున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న రాంపూర్ ఎంపీటీసీ పోతర్ల సుజాత, మిట్టపల్లి ఎంపీటీసీ బాలగంగాధర్, కమలాపూర్ ఎంపీటీసీ సుప్రియ, అమృతాపూర్ ఎంపీటీసీ సాయిలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బయటినుంచి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.

● 29న అవిశ్వాసానికి ఏర్పాట్లు

ఎంపీటీసీ సభ్యుల అవిశ్వాస తీర్మాణం మేరకు ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మాణం ఈ నెల 29న ఆర్డీవో రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో అవిశ్వాసం పై చర్చ జరగనుందని ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు మంగళవారం సాయంత్రం తెలిపారు. 10:30 గంటలకు ఎంపీపీపై, 11గంటలకు వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం నిర్వహిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

అయోధ్య రామమందిరంపై బీజేపీ రాజకీయం చేస్తోంది


● రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్

మోర్తాడ్, జనవరి16: అయోధ్యలోని రామమందిరం ప్రతిష్ఠాపన పట్ల బీజేపీ రాజకీయంగా వాడుకుంటోందని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మోర్తాడ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామ మందిర ప్రతిష్ఠాపన పట్ల వ్యతిరేకం కాదని, హిందువులుగా రామ మందిర ప్రతి ష్ఠాపన కోరుకుంటుందన్నారు. బీజేపీ రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల ముందు ప్రతిష్ఠాపన చేయడాన్ని తప్పుపడు తున్నామని అన్నారు. అంతేగాక ఆలయ నిర్మాణం పూర్తి కాక ముందే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతిష్ఠాపన చేయడం సమంజసంగా లేదని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొనడంలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల బీజేపీ విషం చిమ్ముతోందని అన్నారు. బీజేపీ వారే హిందువులు కాదని, కాంగ్రెస్ వాళ్ల కూడా హిందువులు అని మాకు రాముడు అంటే భక్తి ఉందని వేణుగోపాల్ అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల సునీల్ కుమార్, అడ్వకేట్ ప్రవీన్, మహిపాల్, గిర్మాజీ గోపి, జైడి గంగారాం, బక్కూరి అశోక్, నవీన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నీరజ్, పలు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటగిరి,జనవరి16: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో మారుతి సూచించారు. పొతంగల్ మండలంలోని చేతన్ నగర్, హెగ్డోలి గ్రామాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బీమా, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ సేవలు పొందాని, చిన్న పిల్లల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి జగదీష్, విఠల్, హెల్త్ సూపర్‌వైజర్ సాయి కుమారి, విజయ, సుభాషిణి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనుమ పండుగ


ధర్మారం(బి) వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి,జనవరి 16: సంక్రాంతి పండగ కనుమ వేడుకలను సోమవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఇంటి ముందట వివిధ రకాల రంగుల ముగ్గులు వేశారు. ధర్మారం(బి) వేంకటేశ్వర స్వామి ఆలయంలో కనుమ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాల్కొండలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ముప్కాల్, జనవరి16: బాల్కొండ మండల కేంద్రంలోని నవీన్ పబ్లిక్ స్కూల్‌లో 2009-10పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు మంగళ వారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15ఏళ్ల క్రితం నాటి చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా 15ఏళ్ల క్రితం విద్యార్థి దశలో పాఠశాలలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు తిరుగుతూ ఉపాధ్యాయులతో కలియతిరిగి విషయాలను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులందరు కలిసి పూలమాలు, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నవీన్, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు, పాల్గొన్నారు.


బాల్కొండలో 2009-10 పదవ తరగతి పూర్వవిద్యార్థులు

జిల్లాలో ఘనంగా సంబరాల సంక్రాంతి

భిక్కనూరు, జనవరి 16: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఆనందోత్సాహాల నడుమ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే మహిళలు, యువతులు నూతన వస్త్రాలను ధరించి వాకిళ్లలో రకరకాల ముగ్గులు వేసి వాటిని తీరొక్క రంగులతో తీర్చిదిద్దారు. అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచే యువకులు గాలి పటాలను పోటాపోటీగా డీజే సౌండ్స్ మధ్య ఎగురవేస్తూ కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. కాగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్ల ముందు బొమ్మరిల్లును కట్టి అందులో పాలు పొంగించి మట్టి పాత్రల్లో భోజనాలు తయారు చేసి చిన్నారులు ఒక్కచోట చేరి వాటిని ఆరగించారు. మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో కబడ్డీ పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు.

బీర్కూర్‌లో..

బీర్కూర్: మండలంలో ఊరూవాడ సంక్రాంతి శోభ వెల్లివిరిసింది. పిల్లలు, పెద్దలు అందరూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పతంగుల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలతో చాలా చోట్ల సందడి వాతావరణం నెలకొంది. నూతన వస్త్రాలు ధరించి పిల్లలు, యువకులు, పెద్దలు సందడి చేశారు. పిండి వంటకాలతో మరక సంక్రాంతిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు గాలి పటాలు ఎగురవేసి సందడిగా గడిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రైతునగర్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

పెద్ద కొడప్‌గల్‌లో..

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పిండి వంటలు మొదలుకుని ఇష్టమైన వంటకాలు చేసుకుని పిల్లాపాపలతో సంతోషంగా గడిపారు. ఇక యువతులు, మహిళలు పండుగ సందర్భంగా ఇంటి వాకిళ్లలో అందమైన ముగ్గులు వేశారు. పిల్లలు, యువకులు గాలిపటాలు ఎగురవేస్తు సంతోషంగా గడిపారు. గ్రామాల్లో పశువుల కాపర్లు తమ పశువులు బాగుండాలని కాటమ రాజులకు పండుగ జరిపారు.

మద్నూర్‌లో..

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో మకర సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భోగి రోజు చిన్నారుల తలపై రేగు పండ్లను వేసి ఇంటి ముందర మంటలు వేశారు. సోమవారం సంక్రాంతి రోజు తెల్లవారు జాము నుంచే మహిళలు ఇంటి ముందర రంగవల్లులు వేసి కుటుంబ సభ్యులతో చేలకు వెళ్లి అక్కడ గుడిసెను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఏ వైపున పాలు పొంగుతాయో ఆ వైపు లక్ష్మీ దీపం వెలిగించారు. అనంతరం బోజనాలు చేశారు. ప్రత్యేక వంటకాలతో వన భోజనాలు చేశారు. అనంతరం లక్ష్మీ దీపాన్ని ఇంటికి తీసుకుని వచ్చి దేవుడి గదిలో వెలిగించారు. యువకులు, చిన్నారులు గాలి పటాలు ఎగురవేశారు. నువ్వులు, చక్కెర, బెల్లం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బాన్సువాడ టౌన్‌లో..

బాన్సువాడ టౌన్: పట్టణ ప్రజలు సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు అంతా కలిసి పతంగులు ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. మహిళలు ఇళ్ల ముందు వివిధ రంగులతో ముగ్గులు వేశారు. సంక్రాంతి నోములను ఇచ్చిపుచ్చుకున్నారు. అందరూ కలిసి విదు భోజనం ఆరగించారు. ఒకరినొకరు కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

లింగంపేటలో..

లింగంపేట: మండలంలో సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా పిల్లలు డాబాలపై రంగురంగుల గాలిపటాలను ఎగురవేసి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముందు వాకిళ్లను రంగురంగుల రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. రకరకాల పిండి వంటలు అరగించి ఆనందంగా పండుగను జరుపుకున్నారు. మంగళవారం కనుమ సందర్భంగా పశువులను అందంగా ముస్తాబు చేసి వాటికి తీపి పదార్థలను

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంతో పాటు గొట్టిముక్కుల, సంగమేశ్వర్ ముత్యంపేట, అంచనూర్, చింతమాన్‌పల్లి, సీతారాంపల్లి, లింగుపల్లి గ్రామాల్లో సక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచే వకిళ్లలో ముగ్గులు వేశారు. మహిళలు పిండివంటలు చేశారు. వివిధ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.



భిక్కనూరులో బొమ్మరిల్లులో పాలు పొంగిస్తున్న దృశ్యం



రైతునగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



మద్నూర్‌లో పొలంలో పూజలు నిర్వహిస్తున్న రైతులు



దోమకొండలో పిండి వంటలు చేస్తున్న మహిళలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

దేశభక్తి నేర్పించాల్సిన పాఠశాలలో..

మతపరమైన బోధనలా?

● మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ

బాన్సువాడ టౌన్, జనవరి 16: దేశభక్తి నేర్పించాల్సిన పాఠశాలల్లో మతపరమైన బోధనలు చేయడం భావ్యం కాదని, అలాంటి పాఠశాలలపై విద్యాశాఖాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజుల క్రితం బాన్సువాడ పట్టణంలోని స్పార్క్ మైండ్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులకు మతపరమైన బోధనలు చేస్తున్నా, ఆ పాఠశాలలో వందేమాతరం ఆలపించుకున్నా, వారంలో ఒకరోజు పాఠశాలలోనే మతపరమైన ప్రార్థనలు చేయిస్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. అసలు పాఠశాలలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు బహుశా నిద్రమత్తులో ఉన్నారేమోనని ఎద్దేవా చేశారు. ప్రతీ మతానికి సంబంధించిన పూజలు, ప్రార్థనలు పాఠశాలల్లో చేయించుకుంటూ పోతే పాఠశాల వ్యవస్థ, విద్యావ్యవస్థ ఏమైపోతదని అధికారులు ఎన్నడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. మతపరమైన బోధనలు చేసిన ఉపాధ్యాయునిపై కమ్యూనల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడంతో పాటు, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే విద్యాశాఖ కమిషనర్ వరకు ఈ అంశాన్ని తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం ఆయన రామమందిర విగ్రహ ప్రతిష్ఠాపన గురించి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 22 వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 18న బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులో గల తెలంగాణ తిరుపతి దేవస్థానంలో స్వచ్ఛ్ తీర్థ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గార్గే, డాకయ్య, శంకర్‌గౌడ్, హన్మండ్లు, కోనాల గంగారెడ్డి తదితరులున్నారు.



టిప్పర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించిన దృశ్యం

మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

తాడ్వాయి, జనవరి 16: మండలంలో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. టిప్పర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి కొందరు కాంట్రాక్టర్‌లు, రాజకీయ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా మొరాన్ని తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

తాడ్వాయి, జనవరి 16: రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం ఆయన ఆటో నిర్వాహకులకు, యువకులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వి చక్రవాహనదారులు చాలా మంది అజాగ్రత్తగా అతివేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ విక్రమ్, సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో దొంగతనం

కామారెడ్డి టౌన్, జనవరి 16: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామ పరిధిలోని గురు రాఘవేంద్రకాలనీలో గల గాజుల రాజ్‌కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. ఇంటికి తాళం వేసి రాజ్‌కుమార్ అతని కుటుంబ సభ్యులు బయటకు వెళ్లడంతో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి 2 తులాల బంగారం దొంగిలించుకుపోయినట్లు తెలిపారు. క్లూస్ టీంతో దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వాహనదారులకు ప్రమాదాల నివారణపై అవగాహన

భిక్కనూరు, జనవరి 16: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద సోమవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల15 నుంచి ఫిబ్రవరి 14వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశంలో ప్రతి నిముషానికి ఒక ప్రమాదం, ప్రతి నాలుగు నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదంలో మరణం సంభవిస్తుందన్నారు. ఎక్కువగా వాహనదారుల నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 2024సంవత్సరాన్ని కామారెడ్డి జిల్లా యాక్సిడెంట్ ఫ్రీ జిల్లాగా చేసేందుకు ప్రతిఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని కోరారు. ఈ మేరకు వాహనదారులు రహదారి నియమాలు పాటించాలని రవాణాశాఖ సిబ్బంది పూలు అందించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆర్‌టీవో వాణి, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటాలి



గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేస్తున్న జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట , జనవరి 16: గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ క్రీడల్లో రాణించాలని స్థానిక జడ్పీటీసీ మనోహర్ రెడ్డి కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని షైన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్యారం, చెస్, బ్యాడ్మింటన్ పోటీలను సోమవారం నిర్వహించారు. పోటీల్లో వివిధ జట్లు పాల్గొనగా మంగళవారం బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని న్విహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించాలని కోరారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడా సామాగ్రిని అందజేసిందన్నారు. గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో ఎంతో నైపుణ్యం కలిగి ఉన్న వారికి తగిన ప్రోత్సాహం లేక వారు క్రీడల్లో రాణించడం లేదన్నారు. ఈ క్రీడా పోటీల్లో చెస్ ఆటలో ప్రథమ బహుమతి సాయిబాబా, ద్వితీయ బహుమతి శ్రీకాంత్, క్యారం డబుల్స్‌లో ప్రథమ బహుమతి వసీం, షైను, ద్వితీయ బహుమతి ఆసిఫ్, అమన్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ బహుమతి ప్రశాంత్, సాయిలు, ద్వితీయ బహుమతి సాజీద్, శ్రీకాంత్‌లు గెలుపొందారు. గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, నాగిరెడ్డిపేట సర్పంచ్ సునీతారెడ్డి, గోపాల్‌పేట సర్పంచ్ వంజరి సునీత, షైన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మసీయోద్దీన్, ఐకేపీ ఏపీఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్లారెడ్డి, జనవరి 16: మండలంలోని గండివేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 216 గ్రామాల్లో ప్రతి గడపగడపకు వెళ్లి సమస్యలను తెలుసుకొని సమస్యలు పరిష్కరించారని ఎమ్మెల్యే అయ్యాక సైతం రూ.10 కోట్లనిధులను సమీకరించి ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి మొదటి అడుగువేసేందుకు కృషిచేయడం అభినందనీయమన్నారు.

'పాక జ్ఞానేశ్వరికి చైర్మన్ పదవి ఇవ్వాలి'

కామారెడ్డిటౌన్, జనవరి 16: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరికి రాష్ట్రమహిళా కమిషన్ చైర్మన్ లేదా కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని గంగపుత్ర కులసంఘాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, నేతలు కోరారు. సోమవారం కామారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా తమ జాతికి రాజకీయంగా ఎలాంటి గుర్తింపు లేదని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు ఉన్న పాకజ్ఞానేశ్వరి సేవలను గుర్తించి మంచి పదవిని సీఎం రేవంత్‌రెడ్డి అందించాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా గంగపుత్ర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటి, ప్రధానకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

'ఈ నెల 22న ప్రత్యేక పూజలు చేయాలి'

లింగంపేట, జనవరి 16: మండలంలోని ప్రతీ గ్రామంలోని దేవాలయాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేయాలని జహిరాబాద్ పార్లమెంట్ నాయకుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆయన సోమవారం లింగంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 22న హిందువుల 500సంవత్సరాల కల నెరవేరిన వేల సంబురాలు అంబరాన్ని అంటేలా చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు పైడి ఎల్లారెడ్డి ట్రస్ట్ ద్వారా 110నీటి శుద్ధి కేంద్రాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో నారాయణ, సాయిలు, మహేశ్, దుర్గాగౌడ్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

యువతకు క్రీడా దుస్తులు పంపిణీ

పెద్ద కొడప్‌గల్, జనవరి 16: జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామ సర్పంచ్ అస్పత్‌వార్ వినోద్ యువతకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన యువత పలు క్రీడలలో ప్రతిభ కనబరుస్తున్నారని, వీరికి క్రీడా దుస్తులు లేవని తన దృష్టికి తీసుకరావడంతో యువతకు దుస్తులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ నాయక్, రాజేష్, వినోద్, రవీందర్, చరణ్, సతీష్, రాజశేఖర్, పండరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



సూరాయిపల్లిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎన్‌ఎస్‌ఎస్‌తో యువతకు చైతన్యం

లింగంపేట, జనవరి 16: ఎన్‌ఎస్‌ఎస్‌తో యువతను చైతన్యవంతం చేయవచ్చునని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని సూరాయిపల్లిలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ సీతాకాల ముగింపు శిబిరంలో పాల్గొని మాట్లాడారు. సమాజ సేవ ద్వారా ప్రతీ వలంటీర్ వక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలియజేశారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ మాట్లాడుతూ.. వారం రోజులుగా గ్రామంలో రోడ్లు, ఆలయాలు శుభ్రపరిచారని, బస్టాండ్‌కు పేయింట్ వేశారని ఆయన తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగు దొడ్ల వినియోగం, మొక్కల పెంపకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించారని వలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ధర్‌సింగ్, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డిలతో పాటు కో ఆర్డినేటర్లు గ్రామస్థులు ఉన్నారు.

ఉపాధ్యాయసంఘాల సమాఖ్య ఏర్పాటు



నూతనంగా ఏర్పడిన ఉపాధ్యాయసంఘాల సమాఖ్య

కామారెడ్డిటౌన్, జనవరి 16: జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్యను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమాఖ్యకు చైర్మన్‌గా భిక్నూర్ యాదయ్య, కో చైర్మన్‌గా కుంటరాములు, అబ్దుల్‌హాది, బషీర్‌లను, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పంపరి ప్రవీణ్‌కుమార్, ముజిబొద్దిన్, ట్రెజరీగా బదావత్ దేవులా, సిరిగిరి తిరుపతి, టెక్నికల్ సెక్రటరీగా సంతోష్, పందిరిరాజేష్, అకడమిక్ కౌన్సిలర్‌లుగా అరుణ్‌కుమార్, సంగెం శ్రీనివాస్, పల్లె రమేష్‌గౌడ్, ప్రభాకర్, సలహాదారులుగా విజయరామరాజు, హన్మంత్‌రెడ్డిలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలు అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువస్తూ పరిష్కారం చూపే విధంగా కృషిచేస్తామన్నారు. విద్యాశాఖ ఉపాధ్యాయసంఘాలతో చర్చించకుండా తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను సమాఖ్య పక్షాన ఖండిస్తున్నామన్నారు.

హిమాలయ శిఖరాన్ని అధిరోహించిన భార్గవికి సన్మానం

మాచారెడ్డి, జనవరి 16: పాల్వంచ మండలంలోని పరిధ్‌పేట్‌కి చెందిన భార్గవి హిమాలయ శిఖరాన్ని అధిరోహించింది. దీంతో గ్రామ సర్పంచ్ ఆసం భాగ్యమ్మ గంగాగౌడ్ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. ఈనెల 10న 2,874 మీటర్ల హిమాలయ పర్వతం అధిరోహించి గ్రామానికి పేరు ప్రతిష్టలు సంపాదించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లె రమేష్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి, దీపాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

● కన్న తండ్రే అఘాయిత్యానికి పాల్పడిన వైనం ● పోక్సో చట్టం కింద కేసు నమోదు

బీబీపేట, జనవరి 16 : కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే మృగంలా మారి 15ఏళ్ల కన్న కూతురుపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటన బీబీపేట మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. బీబీపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 46ఏళ్ల వ్యక్తి వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, 15ఏళ్ల కూతురు ఉన్నారు. బాలిక గ్రామంలో పదో తరగతి చదువుతోంది. గత ఆదివారం సాయంత్రం బాలిక తల్లి బీబీపేట మండల కేంద్రంలో జరిగే సంతకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన తండ్రి తన కూతురికి కల్లు తాగించాడు. ఆమె మత్తులోకి జారుకున్నాక అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అత్యాచారానికి పాల్పడుతున్న సమయంలోనే సంత నుంచి తిరిగివచ్చిన బాలిక తల్లి.. జరిగిన దారుణాన్ని చూసి చుట్టుపక్కల వారిని పిలిచింది. అందరూ కలిసి తండ్రికి దేహశుద్ధి చేసి.. గదిలో బంధించారు. జరిగిన ఘటనపై బాలిక తల్లి మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడ్వాయి, జనవరి 16: మండలంలోని కన్కల్ గ్రామానికి చెందిన ఎండీ అహ్మద్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కన్కల్ గ్రామానికి చెందిన యువకుడు అహ్మద్ కన్కల్ గ్రామం నుంచి బైక్‌పై కామారెడ్డికి వెళ్తుండగా కృష్ణాజీవాడి గ్రామ శివారులో ఈ ప్రమాదం జరిగినట్లు వివరించారు. కామారెడ్డి నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని గాయపడగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- గుంటూరు కారం

బాన్సువాడ

మహేశ్వరి	- గుంటూరు కారం
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

